# పుట్టిన రోజు కానుక

**తడబడే** అడుగుల్తో మేనేజరు గదిలోకి వెళ్ళాను.

మా మేనేజరు కర్కోటకుడు, మరి అడుగులు తడబడకేం చేస్తాయి?... నేను కాస్త ధైర్యవంతుణ్ని కాబట్టి ఆ మాత్రం తడబడుతూ అయినా వెళ్ళాను. మా సెక్షనులో కొంతమంది పిరికి వెధవలు అడుగులు పడక ప్రాకురుకుంటూ వెళ్ళిన సంఘటనలు కూడా ఉన్నాయంటే మీరు నమ్ముతారా...?

"సార్..."

నా గొంతు నాకే వినబడలేదు సరిగ్గా.

మళ్ళీ పిలిచాను. ఈసారి నూతిలోంచి వచ్చినట్టు వచ్చింది నోటి వెంట మాట. మా మేనేజరు తల పైకెత్తి కళ్ళెగరేశాడు. సారీ... కళ్ళు కాదు. రెప్పలు పైకి ఎగరేశాడనుకుంటా!

"శెలవు..."

"ఆ?..."

"శెల..."

"వీల్లేదు... శెలవెందుకూ అసలు?...నోనోనో... వీల్లేదు... శెలవా?... హు!!" తలదించుకుని మళ్ళీ వ్రాసుకోవడంలో మునిగి పోయాడు.

"సార్..."

తలపైకెత్తి మళ్ళీ రెప్పలు పైకెగరేశాడు.

"చాలా ముఖ్యమైన పని, సార్... దయుంచాలి." చేతులు నలుపుకున్నా. చేతుల మధ్య నుండి మట్టి రాలింది.

"వూ?...ఊహు!...ఆ!!...ఒహో— అర్జంటు పనా?..." అలా కొన్ని క్షణాల పాటు అంటూ గడ్డం కింద చెయ్యి పెట్టుకుని కళ్ళు తేలవేసినట్టు పైకెత్తి సీలింగు వైపు చూసి మరో రెండు క్షణాలు ఆలోచించాడు మేనేజరు.

"సర్లే...ఎప్పుడు కావాలి?..."

నాకు చచ్చేంత సంబరం ఆయిపోయింది మూర్ఛ పోకుండా కంట్రోల్ చేసుకున్నా.

"రేపు, సార్!"

"ఆ!...ఎప్పుడూ?" అరిచాడు గట్టిగా.

నా పాదాలు చల్లబడ్డాయ్—అతను అరిచిన అరుపుకు.

"రే . . . . .పు . . . . . .సా . . . . .ర్"

"వీల్లేదు... రేపు బోర్డు మీటింగుంది. ఆ సంగతి నీకు తెలుసు కదా?... రోజూ ఎక్కువ పని ఎలాగూ ఉండదు. ఇలా ఎప్పుడో పని ఉన్న రోజు శెలవు పెడ్తారు. నోనోనో...వీల్లేదు... రేపా? అహ... వీల్లేదు... బోర్డు మీటింగు...రేపే?!... ఉహు..."

అయినా నేను కదల్లేదు. దీనంగా నిలబడ్డా—జాలిపడ్తాడేమోనని.

"ఇంతకీ ఏం పని?"



"మా ఆవిడ పుట్టిన రోజు, సార్!"

"వ్వాట్!!... మీ ఆవిడ పుట్టిన రోజంటే నీకు ముఖ్యమైన పనా?... ఏం ఇంటి దగ్గర కూర్చుని ఆవిడకు తలంటుతావా? లేకపోతే స్పెషల్సు ఏమైనా నువ్వే వండుతున్నావా?... రేపు పట ఆవిడ తద్దినం. అయినా, నేను రావడం లేదట?... పుట్టిన రోజుకేం... ప్రతి సంవత్సరం వస్తుంది. ఇంకెప్పుడు ఇలా పిచ్చి పిచ్చిగా మాట్లాడొద్దు... యూ కెన్ గో..."

హు!... తద్దినాలు మాత్రం ప్రతి సంవత్సరం రావా? వీడి తద్దినం ఎప్పుడొస్తుందో?!!

నేను గదిలోంచి బయటికి వచ్చేశాను.

ఆరోజు రాత్రి....

"సారీ, సీతా..."

"హు..."

"నిజంగానే నేను శెలవు అడిగాను."

"హు..."

"మా మేనేజరు కర్కోటకుడు..."

"హు..."

"ఇవ్వనంటే ఇవ్వనన్నాడు."

"హు..."

"నన్ను నమ్మవూ, సీతా డియ్యర్?..." నడుం చుట్టూ చేతులు వేసి నా వైపుకు త్రిప్పుకోబోయాను.

మోచేత్తో డొక్కలో పొడిచింది.

"హు..." అనడం ఇప్పుడు నా వంతయింది. ఆడవాళ్ళు అబలలు అన్న తెలివి తక్కువ దద్దమ్మ ఎవడు?

డొక్క తడుముకున్నా.

"అసలు రేపటి ప్రోగ్రాం గురించి నేను చాలా ప్లాన్ చేశాను."

"హు..."

"ఇదిగో... అలా ముక్కుకుండా, మూలగకుండా చెప్పేది విను."

"వూ..."

"అసలు నీ పుట్టిన రోజుకి మంచి చీర కొందామని అనుకున్నా... అదీ బెడిసికొట్టింది."

"హు...హుహు..."

"అదిగో మళ్ళీ!..."

"వూ..."

"ఆ రామస్వామి గాడికి వూరు వెళ్ళే ముందు రెండొందలు అప్పు ఇచ్చానుగా. వాడు వూరు వెళ్ళిన వెంటనే ఎమ్. ఓ. చేస్తానని అన్నాడు. కానీ ఈ రోజు వరకూ చెయ్యలేదు. అసలు ఆ రెండొందలు పెట్టి చీర కొందామని అనుకున్నా."

"హు."

"నా తప్పేముంది చెప్పు? మనం మొన్న సినిమాకి వెళుతుంటే దిలావర్ రావ్ బట్టల కొట్టు షోకేసులో బొమ్మకి కట్టబెట్టిన చీర చూసి నువ్వు చాలా బాగుందని మెచ్చుకున్నావు చూడూ! ఆ చీర కొని నిన్ను సర్ప్రైజ్ చేద్దామని అనుకున్నా. నిజానికి ఆ చీర నాక్కూడా చాలా నచ్చింది. ప్చ్. అసలు ఆఫీసులో ఎడ్వాన్సు తీసుకుందామన్నా వీలు లేదు. పాత లోన్ తాలూకు ఇన్స్టాల్మెంట్లు పూర్తిగా కట్టందే మరో లోన్ ఇవ్వరు. అసలు నెల చివరి వారంలో పుట్టడం నీ తప్పు."

"హు."

"అయినా కొత్త చీర కట్టుకుంటేనే పుట్టిన రోజా?"

"ఊహు. చిరిగిన చీర కట్టుకుంటే. హు!"

"పోనీ శెలవు పెట్టి నీతో సరదాగా గడుపుదామంటే ఆ వెధవ శెలవు ఇచ్చాడు కాదు."

"కొత్త చీర లేకుండా సర్దా ఏమిటి?"

నా డొక్కలో మోచేతి పోటు!

"హు."

"పోనీలెండి. మన పెళ్ళి రోజు కట్టుకున్న చీర కట్టుకుంటాను."

"అలా అన్నావ్ బాగుంది. రేపు సాయంత్రం నేను ఇంటికి వచ్చేసరికి తయారయి రెడీగా ఉండు. సినిమాకి వెళ్ళి హోటల్లో భోజనం చేద్దాం."

"వూ సంబరం."

"సీతా డియర్! మనం రేపు అసలు ఒకరి మీద ఒకరు విసుక్కో కూడదు. పోట్లాడుకోకూడదు. రేపు చాలా జాలీగా గడిపేయాలి."

"మీరు ఆఫీసులో, నేను ఇంట్లోనా? హు."

"ఇంకా కోపం పోలేదా? ప్లీజ్. ఇటు తిరగవూ?"

నడుం చుట్టూ చేతులు వేసి నా వైపుకి తిప్పుకున్నాను.

"ఏదీ...నవ్వు. వూ. నవ్వాలి! నవ్వమంటుంటే. ఏదీ చిన్ని.." బుగ్గ పిదిమాను.

చిరునవ్వు నవ్వింది సీత.

నాకు ధైర్యం వచ్చింది. ముద్దు పెట్టుకున్నా. ఆవిడ గార్కి మూడ్ వచ్చింది. అమాంతం

**మల్లిక్**

మీద పడింది.

"హు."

అప్రయత్నంగా అన్నాను విరిగి పోతూ.

మరునాడు ఆఫీసులో పని చేస్తున్నా నన్నమాటే కానీ నా మనసు మనసులో లేదు. రాత్రి సీత అందించిన మాధుర్యమైన అనుభవం మనసులో మెదులుతూ చక్కిలిగింతలు పెడుతూంది.

సీతతో అనుభవం నా కెప్పుడూ కొత్తగానే ఉంటుంది.

నా సీత కోసం నే నేమైనా చెయ్యాలి! నా కోసం నా సీత ఈ వేళ పుట్టింది. నేను ఏమీ చెయ్యక పోవడ మేమిటి?

దిలావర్‌రావ్ బట్టల కొట్టులోని షోకేసులో బొమ్మకి చుట్ట బెట్టిన చీర జ్ఞాపకం వచ్చింది.

నా సీత కోసం ఆఫ్టరాల్ ఆ చీర సంపాదించ లేనా?

లంచ్ టైం అయింది. నా మెదడులో మెరుపు మెరిసింది.

"పదరా, సుధాకర్ లంచ్‌కి వెళదాం" అన్నాను, మా సెక్షనులోనే పనిచేసే సుధాకర్‌తో.

"నేను టిఫిన్ బాక్స్ తెచ్చుకున్నా."

"ఏం తెచ్చుకున్నావు?"

"సాంబారు అన్నం, బెండకాయ వేపుడు."

"సర్లె. ఆ సాంబారన్నం ఎప్పుడూ ఉండేదే. పద...అలా అజంతాకి వెళ్ళి బిర్యాని కొడదాం."

"ఏం టోయ్ విశేషం?" టిఫిన్ డబ్బా డ్రాయరులో పడేస్తూ అన్నాడు సుధాకర్.

చేప వల్లో పడింది.

ఇద్దరం హోటల్లో చికెన్ బిర్యాని తిన్నాం. బిల్లు చెల్లించాక మొదలు పెట్టాను.

"అవును కానీ, మీ ఆవిడ పుట్టిన రోజుకి నువ్వు ఎలాంటి బహుమతి ఇస్తావ్?"

"ఇప్పుడు ఆ సందేహం ఎందుకొచ్చింది?" అన్నాడు పళ్ళు కుట్టుకుంటూ.

"ఏం లేదు... ఈ వేళ మా ఆవిడ పుట్టినరోజు ..తన కోసం ఏం కొనాలో తోచడం లేదు."

"నేను మా ఆవిడకి ఏదంటే ఇష్టమో అది కొనిస్తాను... నాకు తట్టకపోతే ఏం కావాలని తననే అడుగుతాను..."

"మా ఆవిడ ఒక చీరను చూసి ముచ్చట పడింది."

"మరి అదే కొని తీసుకెళ్ళు..."

నా ప్రాబ్లెమ్ గురించి సుధాకర్‌కి చెప్పాను. నాకు స్నేహితు డొకడు రెండు వందల రూపాయలు ఎం. ఓ. చేయబోతున్నట్టు—అది రేపో, ఎల్లుండో అందవచ్చనీ, అందిన వెంటనే ఇచ్చేస్తాననీ, ప్రస్తుతానికి రెండొందలు సర్దమని అర్థించాను.

వాడు ఏదో నసిగాడు. నాకు వినిపించలేదు. నాకు వినిపించింది—నేను పెట్టించిన కోడి పలావు తిని వాడు త్రేన్చిన త్రేన్పు మాత్రమే.

"పోనీ ఆ మనియార్డరు మీద నీ కంత నమ్మకం లేకపోతే నాలుగురోజుల్లో మనకు జీతాలు అందుతాయి కదా... మొత్తం రెండొందలూ జీతాలు అందినరోజే నీకు ఇచ్చేస్తాను... ఇన్‌స్టాల్‌మెంట్లలో ఇస్తాననే భయం నీకు అక్కరలేదు."

వాడిని బాగా మొగమాట పెట్టాను. వాడు మళ్ళీ బ్రేవ్‌మని త్రేన్చాడు. నా బిర్యాని తిన్నట్టు గుర్తుకొచ్చి కాస్తంత ఇబ్బంది పడ్డాడు. అప్పుడు సమయం రెండు గంటలయింది. మా ఆఫీసు పక్కనే ఉన్న ఆంధ్రా బాంకులో వాడికి ఖాతా ఉంది. రెండొందలు డ్రా చేసి నా చేతిలో పెట్టాడు.

లంచ్‌కి వెళ్ళిన డైరెక్టర్లు మళ్ళీ వచ్చారు. బోర్డు మీటింగు మళ్ళీ సాగింది. మా మేనేజరు అప్పుడప్పుడు బయటికి వచ్చి డైరెక్టర్లకి కావలసిన సమాచారం నా దగ్గరికి వచ్చి తీసుకెళ్తున్నాడు.

బోర్డు మీటింగు నాలుగున్నరకి అయిపోయింది. మా మేనేజరు ముందుకి వెళ్ళి చేతులు రెండూ నలిపాను. మెట్టిరాలింది.

"వూ...వూ...వెళ్ళు. మీ ఆవిడ పుట్టినరోజని అన్నావుగా."

## వంటింటి పద్యాలు:



## సవతిపోరు

ఆ స్త్రమానం చెవి కొరుకుతూ
మన మాట విన నివ్వదు
వడ్డించిన భోజనం తాపీగా
వారి ని తిన నివ్వదు
పడక గదిలో కూడా
ఏకాంతం పడనివ్వదు
సవతి కాని సవతి ఈ ఫోను
మమ్మల్ని సుఖపడ నివ్వదు

- భండారు సరోజినీదేవి

నేను దిలావర్‌రావ్ బట్టల కొట్టుకి పరుగు తీశాను.

"చెప్పండి, సార్... ఏం కావాలి?" సేల్స్‌మాన్ అడిగాడు. నేను చెప్పాను.

"షో కేసులో బొమ్మకి కట్టామా? ఎలాంటి చీర, సార్?"

"నాలుగురోజుల క్రితం కట్టారు. గంధం కలర్ షిఫాన్ జార్జెట్ చీర మీద ఆకులూ, లతలూ ఉంటాయి."

"ఉండండి, సార్, చూస్తాను."

పది నిముషాలు వెతికి చివరికి ఆ చీర బయటికి తీశాడు.

"మీరు అదృష్టవంతులు సార్... ఇలాంటి పీసెస్ పది తెచ్చాం బొంబాయి నుండి అన్నీ అయిపోయాయి. ఇది ఒక్కటే మిగిలింది."

"ఎంత?"

"మూట తొంభై రూపాయలు, సార్!"

పర్సు తీసి రెండు వందల రూపాయల నోట్లు తీశాను.

"కాష్ కౌంటర్ దగ్గర, సార్..." నా కంగారుకి నవ్వుతూ అన్నాడు సేల్స్‌మాన్.

దారిలో మల్లెపూలు, సీతకి ఇష్టమైన జాంగ్రీలు కొన్నాను.

"ఏయ్ రిక్షా... ఇలా రావోయ్..."

మనసు ఆనందంతో పూగిపోతుందేమో బేరమాడకుండా రిక్షా ఎక్కాను.

ఈ చీర తీసుకెళ్ళి సీతకిస్తే ఎంత సంతోషిస్తుందో.. వూహించని అదృష్టానికి ఉక్కిరిబిక్కిరి అయిపోతుంది. ఈ చీర కట్టుకుని, వదులుగా వేసిన జడలో మల్లెపూలు పెట్టుకుని నవ్వుతూ తుళ్ళుతూ సీత నా పక్కన నడుస్తుంటే దారిలో వెళ్ళే అందరికీ ఈర్ష్య కలగాల్సిందే.

ఇల్లు వచ్చేసింది. రిక్షా వాడికి డబ్బులు ఇచ్చి పంపించేశాను.

కాలింగ్ బెల్ నొక్కాను, గుండెలో గంతులేస్తున్న ఆనందాన్ని నొక్కి పెడుతూ చేతిలోని పాకెట్ వెనక్కి పట్టుకుని నిలుచున్నా సీత తలుపు తియ్యగానే —'నీ కోసం ఏం తెచ్చానో చెప్పుకో' అని అడగాలని.

తలుపు తీసిన సీతనుచూసి షాక్ తిన్నాను. గంధం కలర్ షిఫాన్ చీర మీద లతలూ, డిజైన్!!... ఆ చీరలో సీత!!..

"ఏమిటలా ఆశ్చర్య పోతున్నారు. మీరు ఆఫీసుకు వెళ్ళగానే మీ ఫ్రెండ్ రామస్వామి పంపిన మనియార్డరు వచ్చింది. మీరు చెయ్యలేకపోయానే అని బాధపడిన పనిని నేను చేశాను. మీరు వచ్చేసరికి ఈ చీరలో కనిపిస్తే ఉక్కిరిబిక్కిరి అవుతారని వెంటనే దిలావర్‌రావ్ కొట్టుకి వెళ్ళి ఈ చీర కొనుక్కుని వచ్చేశాను.... చాలా బావుందికదండీ చీర..." నా చుట్టూ చేతులు వేసి నా చొక్కాని నలిపేస్తూ అంది సీత.

నేను విసుక్కుందామని అనుకున్నా గానీ రాత్రి చేసుకున్న అగ్రిమెంటు గుర్తుకు వచ్చి వూరుకున్నా. ★